క్లుప్తంగా

అందుబాటులో అన్నిరకాల మందులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మహంతి కల్యాణి

భోగాపురం (పూసపాటిరేగ): అన్నిరకాల మందులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఎంపీపీ మహంతి కల్యాణి వైద్యాధికారులకు సూచించారు. పూసపాటిరేగ మండలంలోని రెల్లివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీపీ మహంతి కల్యాణి అధ్యక్షతన వైద్యాధికారులు, అడ్వైజరీ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సీజనల్‌లో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ, ప్రజలకు అవసరమైన అన్ని రకాల మందులను ముందుగా అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, వైద్యాధికారి భాగ్యరేఖ, వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అసభ్యకర మాటలు తగవు ..

నెల్లిమర్ల రూరల్: టీడీపీ నేతలు తమ మాటలను అదుపులో పెట్టుకోవాలని టూరిజం బోర్డు రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు హితవు పలికారు. మండలంలోని సీతారామునిపేటలో బుధవారం ఆయన మాట్లాడుతూ, గన్నవరంలో జరిగిన సమావేశంలో పలువురు టీడీపీ అగ్ర నాయకులు అసభ్యకరంగా మాట్లాడడం బాధాకరమన్నారు. చంద్రబాబు మీకు నేర్పించిన సంస్కారం ఇదేనా అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతోనే మతి భ్రమించి పిచ్చికూతలు కూస్తున్నారన్నారు. భాష మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవన్నారు.

జగన్నాథవలసలో 'పొలంబడి'



జగన్నాథవలసలో పొలంబడి కార్యక్రమంలో ఏవో కన్నబాబు, రైతులు

వంగర: మండలంలోని జగన్నాథవలస గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఏవో తట్టికోట కన్నబాబు మాట్లాడుతూ పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. సమగ్ర వ్యవసాయ పర్యావరణ(ఏఈఎస్ఏ), శత్రుపురుగులు, మిత్రపురుగుల నిష్పత్తి ఆధారంగా క్రిమిసంహార మందుల వినియోగంపై అవగాహన కల్పించారు. వరి పంటల సాగులో సమగ్ర నీటి యాజమాన్యం, ఆకు చివరి భాగం కత్తిరింపుతో పాటు ప్రతీ రైతు శాస్త్రవేత్తగా ఎదగాలన్నదే లక్ష్యం కావాలన్నారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ పద్మ, రైతులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ సభను విజయవంతం చేయండి

రామభద్రపురం: ఎస్సీ వర్గీకరణ సాధించే క్రమంలో మండల కేంద్రంలో గురువారం నిర్వహించనున్న ఎంఆర్‌పీఎస్ మహాసభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంకి సుధాకర్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సభకు ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉసూరుపాటి బ్రహ్మయ్య ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి ఎస్.లక్ష్మణరావు, లీగల్ అడ్వైజర్ మారిశెట్టి ఆనందరావుమాదిగ, కిల్లాడ రాజు, చంటి, తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతిగృహం పరిశీలన

తెర్లాం: మండలంలోని పెరుమాళి మోడల్ స్కూల్, కళాశాల బాలికల వసతిగృహాన్ని మండల విద్యాశాఖాధికారి జె.త్రినాథరావు ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మితో కలిసి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహంలో ఎంతమంది విద్యార్థినులు ఉంటున్నారు.. ఏమైనా సమస్యలున్నాయా అని వసతిగృహం సంక్షేమాధికారి లలితకుమారిని వివరాలు అడి గి తెలుసుకున్నారు. అనంతరం వంటలను పరిశీలించారు. స్నానపుగదులు, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. అలాగే విద్యార్థినులకు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేయించాలన్నారు.

ఉద్యాన పంటల సాగుపై ప్రత్యేక దృష్టి

వంగర: గ్రామాల్లో ఉద్యాన పంటల సాగుపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమైన ఆయన గ్రామాల్లో జీడి, మామిడి మొక్కలు పెంపకం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో ఎం.సత్యవతి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

లేబర్ అధికారుల తనిఖీలు

బాడంగి: మండల కేంద్రంలోని పలు దుకాణాలను లేబర్ అధికారులు బుధవారం తనిఖీ చేసి బాల కార్మికులున్నదీ, లేనిదీ ఆరా తీశారు. బాలకార్మికులు ఎవ్వరూ పట్టుబడలేదని లేబర్ అధికారులు శ్రీనివాసులు, కె.చంద్రశేఖర్, కె.కిరణ్‌చంద్ర తెలిపారు. తనిఖీల్లో ఆరోగ్యశాఖ అధికారులు ఎం.కిశోర్‌కుమార్, మహిళాశిశు సంక్షేమశాఖకు చెందినఅనిల్‌కుమార్, ఎన్‌జీటీ జి.జానీరాణి, పోలీసులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులవి తప్పుడు ఆరోపణలు

- గత ప్రభుత్వంలో ప్రజలకు ఏం చేశారో చెప్పండి..?
- ప్రభుత్వ ఆస్తులు అమ్మి, అశోక్ బంగ్లాకు రంగులు వేయించింది ఎవరు..?
- కార్పొరేషన్ సాధారణ, అత్యవసర సమావేశాల్లో టీడీపీ పాలనను తూర్పారబట్టిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు
- మధ్యలో వాకౌట్ చేసి వెళ్లిపోయిన ప్రతిపక్ష కార్పొరేటర్



ప్రతిపక్ష కార్పొరేటర్ ప్రశ్నలకు సమాధానమిస్తున్న ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్

విజయనగరం: బూటకపు మాటలు చెబుతూ ప్రజలను నమ్మించి మోసం చేయటం టీడీపీ నాయకులకు అలవాటేనని, అదే తరహాలో రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు అర్థరహిత ఆరోపణలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు నిర్వహించారు. నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో భాగంగా సాధారణ సమావేశంలో పొందుపరిచిన 22 అంశాలకు గాను 20 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అలాగే అత్యవసర సమావేశంలో పొందుపరిచిన 9 అంశాలకు గాను ఏడింటిని కౌన్సిల్ సభ్యులు అంగీకరించారు. అజెండాలో పొందుపరిచిన అంశాలపై చర్చ జరుగుతున్న సమయంలోనే 49వ డివిజన్ కార్పొరేటర్ కర్రోతు రాధామణి వివిధ అంశాలపై ప్రశ్నించారు. స్పందించిన అధికార పక్షానికి చెందిన ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, కో ఆప్షన్ సభ్యుడు ఆశపు వేణు, కార్పొరేటర్లు బండారు ఆనంద్, కంటుభుక్త తవిటిరాజు, అల్లు చాణక్య, మరో ఇద్దరు మహిళా కార్పొరేటర్లు దీటుగా సమాధానమిచ్చారు. గత పాలన కన్నా ప్రస్తుత పాలన ఎంతో మెరుగ్గా ఉందన్నారు. ఉద్దేశపూర్వకంగా తమ ఉనికిని కాపాడుకోవడానికి ప్రతిపక్షం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆస్తులు అమ్ముకుని కేంద్ర మాజీమంత్రి అశోక్ గజపతిరాజు ఇంటికి రంగులు వేసుకుంటే.. నేటి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి హయాంలో నగరంలో అభివృద్ధి జరుగుతోందన్నారు. ఒక్క 49 డివిజన్‌లోనే రూ.50 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. మీ అశోక్ గజపతిరాజు నగరాభివృద్ధికి ఏమి చేశారో చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రోడ్లు, కాలువలు, వీధిలైట్లు, తాగునీటి సరఫరా, జంక్షన్ల అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. దీంతో ప్రతిపక్ష కౌన్సిలర్ వాకౌట్ చేసి వెళ్లిపోయారు.

యాక్ట్ ప్రకారం అజెండా

అజెండాలోని అంశాలపై చర్చ జరుగుతున్నప్పుడు మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్ అజెండా రూపకల్పనపై మండిపడ్డారు. అజెండా రూపొందించే విధానం ఇది కాదని.. అర్థం కాని, కొత్త పదాలు ఉపయోగించి అజెండా తయారు చేయడం సరికాదన్నారు. అజెండా ఎలా తయారు చేయాలో మున్సిపల్ యాక్ట్‌లో ఉందని.. అది చదివి తయారు చేయాలన్నారు. కౌన్సిల్ సమావేశానికి వారం రోజులు ముందు అజెండా ఇవ్వాలని, కేవలం మూడు రోజుల ముందు ఇస్తే ఎలా అని బాధ్యులను ప్రశ్నించారు.



సమావేశంలో పాల్గొన్న మేయర్ విజయలక్ష్మి

నగరాభివృద్ధికి కృషి..

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సూచనలు, సలహాలతో నగరాభివృద్ధికి పాటుపడుతున్నట్లు మేయర్ వెంపడాపు విజయలక్ష్మి తెలిపారు. సభ్యులందరూ సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. ఇప్పటికే నగరంలో అనేక ప్రధాన జంక్షన్లను అభివృద్ధి చేశామని, ప్రధాన రహదారులు కూడా పూర్తయితే నగరం మరింత అందంగా రూపుదిద్దుకోనుందని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు టంగుటూరి



జిల్లా పోలీసు కార్యాలయంలో టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, తదితరులు



పీటీసీలో టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పీటీసీ ప్రిన్సిపాల్ ఆనందబాబు, తదితరులు

విజయనగరం క్రైమ్: ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి దివంగత టంగుటూరి ప్రకాశం పంతులు చిరస్మరణీయులని ఆర్మ్‌డ్ రిజర్వు డీఎస్పీ యూనివర్స్ పేర్కొన్నారు. టంగుటూరి జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం టంగుటూరి చిత్రపటానికి పూలమాల లేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో సైమన్ కమిషన్ భారతీయులపై కాల్పులు నిర్వహించగా, వారికి ఎదురు నిలిచి తన గుండెలు చూపిన ధీరుడు, ధైర్యశాలి అని కొనియాడారు. ఆయన ఆంధ్ర రాష్ట్రానికి చేసిన సేవలకు గుర్తుగా ఆయన స్వంత జిల్లా ఒంగోలును 1972లో ఆయన పేరుతో ప్రకాశంగా నామకరణం చేశారన్నారు. పేద కుటుంబంలో పుట్టిన పంతులు ఎంతో కష్టపడి, వారాల అబ్బాయిగా ఉన్నత చదువులు చదివి, స్వశక్తితో ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగారన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎన్.గోపాలనాయుడు, డీసీఆర్‌బీ ఎస్ఐ ప్రభావతి, ఆర్ఎస్ఐలు ఎల్.శ్రీనివాసరావు, కేశవరావు, ఎస్పీ పీఏ ఎం.కృష్ణమూర్తి, జిల్లా పోలీసు కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పీటీసీలో టంగుటూరికి ఘన నివాళి

పోలీసు శిక్షణ కళాశాల ఆవరణలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. పీటీసీ ప్రిన్సిపాల్ టి.ఆనందబాబు టంగుటూరి చిత్రపటానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి, తెల్లదొరలను హడలెత్తించి ఆంధ్రకేసరిగా పేరు పొందిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాల జాతర నేడు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ జాతర గురువారం జరగనుంది. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా దూసుకుపోతున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ ప్రజల మన్ననలు అందుకుంటోంది. గ్రామాల్లో ప్రభుత్వ భవనాలు అందుబాటులోకి తీసుకువచ్చి ప్రభుత్వ సేవలను ప్రజల ముంగింటికే అందించేందుకు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రత్యేక చొరవతో కొండవెలగాడ, చిన బూరాడపేట, చంద్రంపేట గ్రామాలకు ప్రభుత్వ భవనాలు మంజూరయ్యాయి. అలాగే కొత్తగా ఆర్టీసీ బస్సు సేవలు కూడా ప్రారంభం కానున్నాయి. ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు లాంఛనంగా ప్రారంభించనున్నారు.

ఐదు గ్రామాల్లో..

కొండవెలగాడలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయం, రూ.21.8 లక్షల నిధులతో నిర్మించిన ఆర్‌బీకే భవనాలను తొలుత ప్రారంభించనున్నారు. అనంతరం విజయనగరం నుంచి గజపతినగరం మీదుగా ఆర్టీసీ బస్సు సేవలను జెండా ఊపి ప్రారంభిస్తారు. తర్వాత చంద్రంపేటలో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.21.8 లక్షల నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తారు. చిన బూరాడపేటలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, పెద బూరాడపేటలో రూ.45 లక్షలతో నిర్మించిన సీసీ రహదారి, పారసాం గ్రామంలో కమ్యూనిటీ స్టేజ్‌ను ప్రారంభిస్తారు.



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న కొండవెలగాడ నూతన సచివాలయ భవనం

నగర అభివృద్ధే ధ్యేయం



విద్యుత్ దీపాల ప్రారంభోత్సవంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, మేయర్ విజయలక్ష్మి, తదితరులు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: నగర అభివృద్ధే తమ ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. కార్పొరేషన్ పరిధి 24వ డివిజన్ బొడ్డువారి జంక్షన్‌లో కార్పొరేషన్ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ విద్యుత్ దీపాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల బుధవారం ప్రారంభించారు. ఐదు డివిజన్లకు సంబంధించి ప్రధాన కూడలి వద్ద హైమాస్ట్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం డివిజన్ కార్పొరేటర్, జోనల్ ఇన్‌చార్జ్ కంటుభుక్త తవిటిరాజు, స్థానిక కార్పొరేటర్ పిల్లా రాధాభవానీ మాట్లాడుతూ, నగరంలో అనేక ప్రాంతాల్లో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మేయర్ వి.విజయలక్ష్మి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు భవిరెడ్డి సతీష్, జోనల్ ఇన్‌చార్జ్ ఈశ్వరరావు, విద్యార్థి విభాగం అధ్యక్షుడు కేదారశెట్టి లక్ష్మణమూర్తి, డీఏ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య దశ నుంచే నాయకత్వ లక్షణాలు

విజయనగరం అర్బన్: విద్యతో పాటు నాయకత్వ లక్షణలను బాల్య దశ నుంచే అలవరచుకోవాలని శ్రీచైతన్య పాఠశాల ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక రింగ్ రోడ్ చైతన్య పాఠశాలలో జరిగిన ప్రత్యేక సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా నిర్వహించిన జాతీయ జెండాలతో విద్యార్థుల కవాతు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఇటీవల జరిగిన పాఠశాల ఎన్నికల్లో ఎన్నికైన హెడ్ బాయ్, హెడ్ గర్ల్ బృందాలకు మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ బాబు, పాఠశాల డీన్స్ సత్యనారాయణ, సాయి కిశోర్, సూర్యచంద్ర, అప్పలనాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ జెండాతో విద్యార్థుల కవాతు

టంగుటూరిని ఆదర్శంగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. పట్టణంలో టంగుటూరి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, టంగుటూరి దేశభక్తి, త్యాగ నిరతిని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ప్రజలకు ఎనలేని సేవలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ సరోజిని, పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జానా ప్రసాద్, వైస్ చైర్మన్లు రామారావు, కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

'యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి'

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ వినియోగదారులు తమ ఫోన్లలో ఈపీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని 16 అంకెల సర్వీస్ నంబర్‌ను ఎంటర్ చేసి, ఆధార్ లింక్ చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ముచ్చుల లక్ష్మణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ యాప్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించాలని కోరారు.

మహిళాభ్యున్నతికి ప్రాధాన్యం



క్యాంటీన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: మహిళల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలో స్థానిక మొయిద జంక్షన్ వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రూ.10కే నాణ్యమైన ఆహారం అందించడమే కాకుండా, మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్యాంటీన్‌ను నెలకొల్పిందన్నారు. అర్బన్ మార్ట్ ద్వారా స్వయం సహాయక బృందాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. మహిళల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని.. అమ్మఒడి, చేయూత, ఆసరా, విద్యా కానుక, విద్యా దీవెన, తదితర పథకాల లబ్ధిని మహిళలు నేరుగా పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, మండల అధ్యక్షుడు చనమళ్ల వెంకటరమణ, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, నేతలు జానా ప్రసాద్, గంటా సత్యనారాయణ, అప్పలరాజు, మజ్జి గణేష్, కమిషనర్ బాలాజీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమం...

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



నెల్లిమర్ల రూరల్: లబ్ధిదారునికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇంటింటికీ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని గాంధీనగర్ కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అందించిన పథకాలు, చేసిన అభివృద్ధిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడుతూ, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వంలో ఏ పథకం పొందాలన్నా జన్మభూమి కమిటీలకు లంచం ఇవ్వాల్సి ఉండేదని.. నేడు ఆ పరిస్థితి ఎక్కడా లేదన్నారు. ప్రజలకు మంచి చేస్తుంటే ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ఓర్వలేకపోతున్నాయని, మంచిపై కూడా అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో గెలిచే పరిస్థితి లేకపోవడంతోనే ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి రానున్న రోజుల్లో అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, మండల అధ్యక్షుడు చనమళ్ల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, వైకుంఠం, కార్పొరేషన్ల డైరెక్టర్లు జానా ప్రసాద్, రేగాన శ్రీను, నాపాడ శ్రీను, కౌన్సిలర్ జానా సంధ్యారాణి, నాయకులు గంటా సత్యనారాయణ, అప్పలరాజు, కమిషనర్ బాలాజీ ప్రసాద్, తహసీల్దార్ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

చక్కని వేదిక..

విజయనగరం: నగరంలోని 43వ డివిజన్ 52వ సచివాలయ పరిధిలో కంటోన్మెంట్ ఉడా కాలనీ ఫేజ్ 2 ప్రాంతంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్‌లు కోలగట్ల తమ్మన్నశెట్టి, డాక్టర్ వీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ఈ నాలుగేళ్ల కాలంలో ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా తమ్మన్నశెట్టి మాట్లాడుతూ, స్థానిక సమస్యలను తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం చక్కన వేదిక అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించారని చెప్పారు. కార్పొరేటర్ దాసరి సత్యవతి, డివిజన్ అధ్యక్షుడు వంతరాం సురేష్ కుమార్ మాట్లాడుతూ, తమ డివిజన్ అభివృద్ధికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే కోటీ యాభై లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ డివిజన్ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విజయనగరం: గడప గడపకు.. కార్యక్రమంలో పాల్గొన్న జోనల్ ఇన్‌చార్జ్‌లు కోలగట్ల తమ్మన్నశెట్టి, డాక్టర్ వీఎస్ ప్రసాద్

మహిళలకు రక్షణ లేదు

- ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవానీ

విజయనగరం పూల్‌బాగ్: మహిళల మీద జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలు అరికట్టడంలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విఫలమయ్యారని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. దుర్గాభవానీ ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య విజయనగరం జిల్లా 12వ మహాసభలు బుధవారం స్థానిక అమర్ భవన్‌లో జరిగాయి. ముందుగా స్థానిక మయూరి జంక్షన్ నుంచి మహిళలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహాసభ ప్రాంగణంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జెండాను దుర్గాభవానీ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో మహిళలపై దాడులు జరుగుతున్నా డీజీపీ ఎందుకు మాట్లాడం లేదని ప్రశ్నించారు. కఠిన శిక్షలు లేకపోవడం వల్లే ఆకతాయిల ఆగడాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత పావని, జిల్లా గౌరవాధ్యక్షురాలు మద్ది మాణిక్యం, జిల్లా అధ్యక్షురాలు బాయి రమణమ్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు షేక్ చాంద్‌బీబీ, ఉంగరాల జయలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి కె. స్రవంతి జిల్లా సమితి సభ్యులు పార్వతమ్మ, తదితులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవానీ